అర్హులకు పథకాలు అందించాలి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికారి భీమయ్య

■ నర్సాపూర్, డిసెంబర్ 16 : పట్టణంలోని మహిళా మండల సమాఖ్య కార్యాలయంలో శనివారం నాలుగు మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీలతో గ్రామీణ అభివృద్ధిశాఖ జిల్లా అదనపు అధికారి భీమయ్య సమీక్ష నిర్వహించారు. సమావేశంలో బ్యాంక్ లింకేజి, ఫుడ్ ప్రాసెస్, లోకోస్, అజీవికా గ్రామీణ ఎక్స్ ప్రెస్ యోజన స్కీమ్, ఎంటర్‌ప్రైజెస్, స్త్రీనిధి అంశాలపై చర్చించారు. అర్హులకు ప్రభుత్వ పథకాలను అందించాలని డీఆర్డీవో అదనపు అధికారి సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు మోహన్, వెంకటేశ్వర్లు, స్త్రీనిధి రీజనల్ మేనేజర్ గంగారాం, మేనేజర్ కరుణాకర్, నర్సాపూర్, కౌడిపల్లి, శివ్వంపేట్, చిలిపిచెడ్ మండలాల ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

నందిగామలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో జగదీశ్వర్‌చారి

■ నిజాంపేట, డిసెంబర్ 16 : మొక్కలకు సకాలంలో నీళ్లు అందిస్తూ పశువుల బారి నుంచి సంరక్షించాలని ఎంపీడీవో జగదీశ్వర్‌చారి అన్నారు. నిజాంపేట మండలంలోని నందిగామలో హరితహారం నర్సరీని శనివారం పరిశీలించారు. నర్సరీలో మొక్కలు చనిపోతే వాటి స్థానంలో కొత్తవి పెంచాలని, కలుపు మొక్కలను ఎప్పటికప్పుడూ తొలిగిస్తూ జాగ్రత్త పడాలని వన సేవకులకు ఎంపీడీవో సూచించారు. ఆయన వెంట కార్యదర్శి ఆరిఫ్‌హుస్సేన్, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రేమలత ఉన్నారు.

లయన్స్‌క్లబ్ సభ్యుల చేయూత

అయ్యప్ప మాలదారుడికి నగదు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

■ రామాయంపేట, డిసెంబర్ 16: అయ్యప్ప భక్తుడికి లయన్స్ క్లబ్ సభ్యులు శనివారం ఆర్థికసాయం అందజేశారు. పట్టణంలోని వేంకటేశ్వర కాలనీకి చెందిన స్నేహబంధు లయన్స్‌క్లబ్ దంపతులు సతీశ్‌రావు, మౌనిక నిజాంపేట మండలం నార్లాపూర్‌కు చెందిన తాటికొండ రవీందర్‌రెడ్డికి రామాయంపేటలో రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో దామోదర్‌రావు, ఐరేని రవీందర్‌గౌడ్, గడ్డం గంగారామ్ ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ

■ శివ్వంపేట, డిసెంబర్ 16 : మండలకేంద్రంలో కొంతాన్‌పల్లి సత్యనారాయణగౌడ్ గురుస్వామి ఇంటిలో శనివారం అయ్యప్ప మహాపడిపూజను వామనశర్మ, అరుణ్ గురుస్వామి పర్యవేక్షణలో నిర్వహించారు. ముందుగా రుద్రాభిషేకం చేపట్టారు. కార్యక్రమంలో గురుస్వాములు రమేశ్, శ్రీనివాస్, అరుణ్, నగేశ్, రాము, సత్యనారాయణ, శ్యామ్‌సుందర్‌గుప్తా, దీక్షదారులు రాజు, రమేశ్, సందీప్, మధు, హరీశ్, సాయి, యాదగిరి, హరికృష్ణ, నాగరాజు, అజయ్, ప్రసాద్, శ్రీకాంత్, శ్రీను, ప్రవీణ్, ప్రకాశ్, మహేశ్, గణేశ్, వంశీ, రాము ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

■ మెదక్ రూరల్, డిసెంబర్ 16 : కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అవుసలపల్లి శివారులో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు. మెదక్ మున్సిపల్‌లోని అవుసలపల్లికి చెందిన కందుల రాములు(39) శనివారం తన వ్యవసాయ పొలం వద్ద చెట్లను కరెంట్ మిషన్‌తో కోస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌తో మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెంకటయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

■ శివ్వంపేట, డిసెంబర్ 16 : మండలంలోని చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన మదిరె నిర్మల చాకరిమెట్ల ఆంజనేయ ఆలయంలో కొడుకు రోహిత్(11)తో కలిసి భిక్షాటన చేస్తున్నది. శనివారం ఉదయం చిన్నగొట్టిముక్ల చౌరస్తాకు తల్లీకొడుకు వచ్చారు. రోహిత్ రోడ్డు దాడుతుండగా లారీ ఢీకొట్టింది. రోహిత్‌ను మెరుగైన చికిత్సకు గాంధీ దవాఖానకు తరలించారు.

కొల్చారం : రంగంపేట హైస్కూల్‌లో విద్యార్థిని అక్షయను అభినందిస్తున్న డీఈవో రాధాకిషన్

నర్సాపూర్ : బంజారానగర్ జడ్పీ స్కూల్‌లో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న జేడీ రాజీవ్ మిశ్రా

పిల్లలను బడికి పంపాలి

■ విద్యార్థులు క్రమం తప్పకుండా స్కూల్‌కు రావాలి
■ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ రాజీవ్ మిశ్రా
■ బంజారానగర్ జడ్పీ స్కూల్ సందర్శన
■ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం

నర్సాపూర్, డిసెంబర్ 16 : తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని విద్యాశాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ రాజీవ్‌మిశ్రా సూచించారు. నర్సాపూర్ మండలంలోని బంజారానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఎంఈవో బుచ్చానాయక్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. చదువులో వెనుకబడితే ఉపాధ్యాయులతో చర్చించి శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో ప్రతినెలా ఎస్ఎంసీ (పాఠశాల యాజమాన్య కమిటీతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు పాఠ్యప్రణాళిక రాసి విద్యాబోధన చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కరుణ, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం రాంసింగ్, సీఆర్పీ విశ్వకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించాలి

★ జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్

చిలిపిచెడ్/ కొల్చారం, డిసెంబర్ 16 : విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్ పేర్కొన్నారు. చిలిపిచెడ్ మండలంలోని గౌతాపూర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. అనంతరం 7వ తరగతిలో సాంఘిక శాస్త్రం, 8వ తరగతిలో జీవ శాస్త్రంపై ఉపాధ్యాయుల విద్యాబోధనను విద్యార్థులతో కలిసి డీఈవో విన్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులు మెరుగైన లక్ష్యం సాధించేలా ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎంవో సుదర్శన్‌మూర్తి, హెచ్ఎం కృష్ణ, టీచర్లు శ్రీధర్‌రెడ్డి, ఈశ్వరమ్మ, శ్రీనివాస్, సంజీవ్, సత్యం, సర్వన్, జె.శ్రీనివాస్, స్వరూప పాల్గొన్నారు.

క్రీడాకారిణికి డీఈవో అభినందనలు

కొల్చారం మండలం రంగంపేట జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 15న సంగారెడ్డిలో జరిగిన ఉమ్మడి జిల్లా కబడ్డీ టోర్నమెంట్‌లో అండర్-17(బాలికలు)లో రంగంపేట జడ్పీహైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఎస్.అక్షయ సత్తా చాటింది. ఈ మేరకు హనుమకొండలో జరుగనున్న రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైంది. రంగంపేట జడ్పీహైస్కూల్‌ను సందర్శించిన డీఈవో రాధాకిషన్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్‌మూర్తి క్రీడాకారిణి అక్షయ, ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఉపేందర్‌రెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కంచర్ల నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలి

■ జూనియర్ సివిల్ న్యాయమూర్తి రీటాలాల్‌చంద్

మెదక్ అర్బన్, డిసెంబర్ 16 : ప్రతిఒక్కరూ చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి రీటాలాల్‌చంద్ అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ట్రైబెల్ వెల్ఫేర్ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో శనివారం లీగల్ లిటరసీ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. మహిళలకు చట్టాలు రక్షణ కల్పిస్తున్నాయన్నారు. చట్టాలపై మహిళలకు అవగాహన ఉండాలని సూచించారు. కనీస వయస్సు రాకముందే పెళ్లి చేసుకుంటే అనేక ఇబ్బందులకు గురవుతారని, ఫలితంగా కుటుంబం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. విద్యార్థులు వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోలు షేర్ చేయవద్దని సూచించారు. చిన్నపిల్లలను శారీరకంగా వేధిస్తే 6 నుంచి జీవితఖైదు శిక్ష ఉంటుందన్నారు. మంచి, చెడుల గురించి తల్లిదండ్రులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రజల కోసం ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేసి న్యాయం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు సిద్దాగౌడ్, సిద్ధిరాములు, కళాశాల ప్రిన్సిపాల్ వసంత, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి రీటాలాల్‌చంద్

నారుమడుల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

రామాయంపేట : రైతుకు సూచనలిస్తున్న ఏవో రాజ్‌నారాయణ

చిలిపిచెడ్/ రామాయంపేట, డిసెంబర్ 16 : వరి నారుమడుల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, అకుచుట్టు పురుగు నివారణకు ఇన్సిఫియో మందును పిచికారీ చేయాలని సింజెంట్ ఇండియా కంపెనీ అధికారి శ్రీకాంత్ సూచించారు. శుక్రవారం రాత్రి చిలిపిచెడ్ మండలంలోని అంతారం గ్రామంలో రైతులకు ఇన్సిపియో మందు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు ఎకరాకు 120 మి.లీ ఇన్సిఫియో మందు పిచికారీ చేయాలన్నారు. దీంతో ఆకుచుట్టు పురుగు తగ్గి ధాన్యం దిగుమతి ఎక్కువగా వస్తుందని వివరించారు.

పంట వ్యర్థాలను కాల్చొద్దు : ఏవో రాజ్‌నారాయణ

పంట వ్యర్థాలను కాలిస్తే భూమిలో ఉన్న సేంద్రియ పదార్థాలు తగ్గుతాయని రామాయంపేట వ్యవసాయాధికారి రాజ్‌నారాయణ పేర్కొన్నారు. రామాయంపేట పట్టణ శివారులో రైతు కిషన్ వరి పంట పొలాన్ని సందర్శించి, సూచనలు చేశారు. పంట వ్యర్థాలను కాలిస్తే భూమిలో ఉన్న సూక్ష్మ పోషకాలు దెబ్బతిని పంట దిగుబడి తగ్గుతుందని తెలిపారు. వరి కోతను అడుగు భాగం వరకు కోయాలన్నారు. పంటకు ఉపయోగపడే భాస్వరం, నత్రజని, పొటాషియం, ఇనుము, జింక్ వంటి పోషకాలు నేలలో ఉండి పంటకు బలాన్ని చేకూరుస్తాయన్నారు. ఏవో వెంట ఏఈవోలు రాజు, సాయికృష్ణ ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి

నర్సాపూర్, డిసెంబర్ 16 : నర్సాపూర్‌లోని గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి పవన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భిక్షమయ్య మాట్లాడుతూ మెదక్‌లోని ఇందిరా గాంధీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన 9వ క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ 2కే రన్‌లో పవన్ రెండో స్థానంలో నిలిచాడు. 23న కామారెడ్డిలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పవన్ పాల్గొంటాడన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కల్యాణి, చార్లెస్, పీడీ సుజాత, కోచ్ శానావాజ్, లెక్చరర్లు మధు, ప్రశాంత్ విద్యార్థిని అభినందించారు.

విద్యార్థి పవన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

ఓటరు నమోదుపై బీఎల్వోలకు అవగాహన

చిలిపిచెడ్, డిసెంబర్ 16: 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని బీఎల్వోలను నయాబ్ తహసీల్దార్ సింధూజ ఆదేశించారు. చిలిపిచెడ్‌లో బీఎల్వోలకు ఓటరు నమోదుపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామాల్లో బీఎల్వోలు ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 31లోగా ఓటరున మోదు, సవరణలు, మార్పులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశ్వర్లు, జూనియర్ అసిస్టెంట్ భూపాల్, బీఎల్వోలు ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 16 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు అరుంధతికి ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. 'నిజామాబాద్ జిల్లా యాక్షగానాలు-సమగ్ర అధ్యయనం' అనే అంశంపై డాక్టర్ నాళేశ్వరం శంకరం మార్గదర్శకంలో పరిశోధన చేశారు. అరుందతికి డాక్టరేట్ రావడంపై ప్రిన్సిపాల్ హుస్సేన్, తెలుగు విభాగాధిపతి డాక్టర్ వామనమూర్తి అభినందించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

SCHOOL BUILDING SALE

★ Running School Building for Sale in Armoor, District: Nizamabad, TS. Total Area 1600 Sq.yds., Total Slab Plinth Area 21000 Sft. Call: 7989918123.
NT-313178-All

WANTED

★ రామకృష్ణ గ్రూపు (A.P., న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.